క్లుప్తంగా

క్రీడాకారులకు కిట్లు అందజేత



పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): క్రీడాకారులు కిట్లను వినియోగించుకోవాలని రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల తెలిపారు. డివిజన్‌లోని 219 సచివాలయం పరిధిలో 'ఆడుదాం ఆంధ్రా'లో పాల్గొంటున్న క్రీడాకారులకు సోమవారం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న మెట్టమొదటి స్పోర్ట్స్ టోర్నమెంట్ ఇదన్నారు. క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు క్రికెట్, బ్యాడ్మింటన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, సచివాలయ అడ్మిన్ రవి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారత టీటీ పోటీలకు పీబీ సిద్ధార్థ విద్యార్థులు



విజయవాడ స్పోర్ట్స్: దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల టేబుల్ టెన్నిస్ పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ జట్టులో తమ కళాశాల విద్యార్థులు కె.చరణ్‌తేజ, బి.వి.మల్లికార్జున రోహిత్, ఎ.గోవింద్ ఎంపికైనట్లు పీబీ సిద్ధార్థఆర్ట్స్, సైన్స్ కాలేజీ వ్యాయామ అధ్యాపకులు ఎ.చిన బాబు తెలిపారు. విజయవాడలోని సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఇటీవల జరిగిన కృష్ణా వర్సిటీ అంతర కళాశాలల పోటీల్లో తమ కాలేజీ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. పోటీల అనంతరం జరిగిన వర్సిటీ జట్టు ఎంపికలో ముగ్గురు విద్యార్థులు నైపుణ్యం ప్రదర్శించినట్లు తెలిపారు. ఫిబ్రవరి ఒకటి నుంచి నాలుగో తేదీ వరకు తమిళనాడులోని అంబేడ్కర్ లా యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత పోటీల్లో జట్టు పాల్గొంటుందన్నారు. క్రీడాకారులను సోమవారం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ ఆచార్య రాజేష్ సి.జంపాల కాలేజీ ప్రాంగణంలో అభినందించారు.

సైన్స్ సంబరాల్లో తృతీయ స్థానం

ఏ.కొండూరు: కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు జిల్లా స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాల్లో తృతీయ స్థానం సంపాదించారని హెచ్ఎం జే ఆదిశేషు సోమవారం తెలిపారు. విజయవాడలో శరత్‌చంద్ర అకాడమీలో జరిగిన చెకుముకి సైన్స్ సంబరాల్లో శ్యామ్ కృష్ణ, చరణ్, రవిచంద్ర ప్రతిభ కనపరిచారు.

ఫిబ్రవరి 3 నుంచి మహిళా ఉత్సవ్



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించడానికి ఫిబ్రవరి 3 నుంచి 11వ తేదీ వరకు మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాల్లో మహిళా ఉత్సవ్-2024ను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాకన్నా చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం జరిగింది. విద్యాకన్నా మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యాన నిరుద్యోగ యువతకు వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. శిక్షణ పొందినవారు తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ కల్పించడానికి 1990 నుంచి ఏటా మహిళా ఉత్సవ్ నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఉత్సవ్ ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ పూర్ణిమ మాట్లాడుతూ ఉత్సవ్‌లో విక్రయాలు చేయాలనుకునే మహిళలు ఈ నెల 28వ తేదీలోపు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



జక్కంపూడి కాలనీలోని స్కూల్‌లో సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో చిన్నారుల సంప్రదాయ వస్త్రధారణ

పాఠశాలల్లో ముగ్గులపోటీలు, నృత్య ప్రదర్శనలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగరంలోని పలు పాఠశాలల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భవానీపురం శివాలయం సెంటర్‌లోని నెల్లూరు రవీంద్ర భారతి పాఠశాలలో విద్యార్థులు ముగ్గుల పోటీలు, నృత్య ప్రదర్శనలు, మోనో కాంటెస్ట్‌లతో పాటు స్కూల్ ఆవరణలో భోగిమంటలు వేశారు. ముఖ్యఅతిథులుగా జోనల్ ఇన్‌చార్జి శివారెడ్డి, డీన్ శ్రీకాంత్ పాల్గొన్నారు. తెలుగు వారి పండుగల్లో అత్యంత ముఖ్యమైన సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాలనే భావనతో ఉత్సవాలు నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజీఎం రాజు, ప్రిన్సిపాల్ రాధ, రాఘవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జక్కంపూడిలో..

జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో భోగిమంటలు, సంక్రాంతి ముగ్గులు, గంగిరెద్దులు, హరిదాసు కీర్తనలు ఆలపించారు. సంక్రాంతి పండగ విశిష్టతను భావితరాలకు తెలియాలని ఉత్సవాలను నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు యూసఫ్ తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ సెక్రటరీ కె. నెహ్రూ, రత్నకుమార్, మాధవరావు, రామకృష్ణ, సురేఖ, సునీత తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రోడ్ల విస్తరణకు నోటిఫికేషన్

పటమట(విజయవాడతూర్పు): రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి వీఎంసీ రోడ్ల విస్తరణకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఏలూరురోడ్డు(కార్ల్‌మార్క్స్‌రోడ్డు) తోపాటు మరో మూడు రోడ్ల విస్తరణకు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్ ఆదేశాలతో వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం ముఖ్య అధికారి, టీడీఆర్(ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్) స్క్రూటినీ కమిటీ కన్వీనర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. కార్ల్‌మార్క్స్ రోడ్డులో పోలీస్ కంట్రోల్ రూం నుంచి గుణదల పడవల రేవు వరకు 100 అడుగులు, పడవల రేవు నుంచి రామవరప్పాడు రింగ్‌వరకు 120 అడుగుల రోడ్డు విస్తరణ చేస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కార్ల్‌మార్క్స్ రోడ్డు నుంచి గుణదల ఈఎస్ఐ ఆస్పత్రి రోడ్డు, పుల్లేటి కాల్వరోడ్డు వరకు 80 అడుగుల విస్తరణ, శ్రీనగరాజపురం నుంచి సాయిమెస్ వరకు 80 అడుగుల రోడ్డుగా, సాయి మెస్ నుంచి పీబీ సిద్ధార్థ కళాశాల వరకు 80 అడుగుల రోడ్డు విస్తరణ చేస్తున్నట్లు నోటిఫికేషన్ ఇచ్చారు. రమేష్ ఆస్పత్రి సిగ్నల్ నుంచి గురునానక్ నగర్, ఆటోనగర్ వరకు 80 అడుగుల రోడ్డు విస్తరిస్తున్నట్లు నోటిఫికేషన్ ప్రకటించారు. ఆయా రోడ్ల విస్తరణకు ఈ నెల 15వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని, వీటిని వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో సమర్పించవచ్చని ఆయన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వీఎంసీ కార్యాలయంలోని నోటీస్‌బోర్డులో, వీఎంసీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు.

పరమాచార్యులకు స్వరార్చన



పంచరత్న కృతులను గానం చేస్తున్న కళాకారులు

విజయవాడ కల్చరల్: ఆధ్యాత్మిక వైభవానికి పూర్వవైభవం తీసుకొచ్చిన పరమాచార్యులకు చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి ఆరాధాన ఉత్సవాలు రామాయణానవాహ్నిక జ్ఞానయజ్ఞ ట్రస్ట్, శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞ ట్రస్ట్ ఆధ్వర్యాన లబ్బీపేట శ్రీ శారద చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న చంద్రశేఖరేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. మంగళవారం వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన 150 మంది వాయిద్య కళాకారులు త్యాగరాజ స్వామి రచించిన ఘనరాగ కృతుల గోష్టిగానం అద్భుతంగా సాగింది. చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి బోధనలు జాతికి శిరోధార్యమని వారి సేవలను నిరంతరం ఆచరించుకోవాలని శ్రీ రామాయణ వాహ్నిక జ్ఞానయజ్ఞ ట్రస్ట్ వ్యవస్థాపకుడు విష్ణుభొట్ల ఆంజనేయ చయనులు సూచించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కరెడ్ల సుందర శర్మ, వైదిక సలహాదారుడు మద్దులపల్లి దత్తాత్రేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

33 మంది సీఐల బదిలీ

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో భారీగా పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల (సీఐ)లకు స్థానచలనం కలిగింది. 33 మంది సీఐలను బదిలీలు చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పెద్ద ఎత్తున బదిలీలు చేపట్టినట్టు తెలుస్తోంది. పలువురు సీఐలను విజయవాడ కమిషనరేట్‌కు పంపగా, ఎక్కువ మందిని వీఆర్‌లో పెడుతూ ఆదేశాలు ఇచ్చారు

సీఐ	ప్రస్తుతం	బదిలీ
కె.కిషోర్‌బాబు	కాకినాడ డీపీటీసీ	విజయవాడ,కమిషనరేట్
తిప్పా గణేష్	తుని-2 టౌన్	విజయవాడ,కమిషనరేట్
ఆర్.విజయకుమార్	బొమ్మూరు, తూర్పుగోదావరి	విజయవాడ, కమిషనరేట్
ఎస్ఎస్ఎస్‌వీ నాగరాజు	తాడేపల్లిగూడెం	విజయవాడ, కమిషనరేట్
బలుమూరి వెంకటేశ్వరరావు	జీలుగుమిల్లి	విజయవాడ, కమిషనరేట్
కె.శివాజీ	వీఆర్, ఏలూరు జిల్లా	విజయవాడ, కమిషనరేట్
ఎ.సుబ్రహ్మణ్యం	విజయవాడ-టూటౌన్	వీఆర్, ఏలూరు రేంజ్
పి.కృష్ణమోహన్	గుణదల, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
పెరవలి రామచంద్రరావు	విజయవాడ, ట్రాఫిక్	వీఆర్, ఏలూరు రేంజ్
అబ్దుల్ సలామ్	ట్రాఫిక్-వన్‌టౌన్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
బీబీ మురళీకృష్ణ	విజయవాడ ట్రాఫిక్	వీఆర్, ఏలూరు రేంజ్
వి.జానకిరామయ్య	విజయవాడ ట్రాఫిక్	వీఆర్, ఏలూరు రేంజ్
కేవీ కృష్ణకుమార్	ఎస్ఈబీ, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
పి.కృష్ణ	సీసీఎస్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
పి.సత్యానందం	సైబర్‌క్రైమ్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
బీహెచ్ వెంకటేశ్వర్లు	ఎస్ఆర్ పేట, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఎ.నాగమురళి	గవర్నర్‌పేట, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఎంవీ దుర్గారావు	కృష్ణలంక, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
కె.శ్రీనివాసరావు	నున్న, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఎం.సుధాకర్	ట్రాఫిక్-1, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
కె.క్రిస్టఫర్	ట్రాఫిక్-2, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఐడీ సువర్ణరాజు	ట్రాఫిక్-3, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఎం.రామ్‌కుమార్	సీసీఎస్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
పి.శ్రీనివాసరావు	సీసీఎస్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
జీవీ వినయ్‌మోహన్	పీసీఆర్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఆర్.అంకబాబు	వీఆర్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఎ.మురళీకృష్ణ	సర్పవరం, కాకినాడ జిల్లా	విజయవాడ, కమిషనరేట్
కె.వాసవి	దిశ, విజయవాడ	దిశ, తూర్పు గోదావరి
జి.శ్రీనివాసయాదవ్	నరసాపురం పట్టణం	ఉయ్యూరు, కృష్ణా జిల్లా

పేదల ఆరాధ్య దైవం వంగవీటి రంగా

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



మైలవరంలో రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: బడుగు, బలహీన వర్గాల ఆరాధ్య దైవం వంగవీటి మోహన రంగా అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మైలవరం ప్రధాన కూడలిలో వంగవీటి మోహన రంగా కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే వసంత, ప్రముఖ సీఏ సుంకర అక్కయ్యనాయుడు, ఆకుల శ్రీనివాసకుమార్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషుతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. కార్పొరేటర్‌గా, ఎమ్మెల్యేగా బడుగు, బలహీనవర్గాల ప్రజలకు రంగా ఎంతో అండగా నిలిచారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. రంగా మృతి చెంది 35 సంవత్సరాలు గడచినా ఇంకా రాష్ట్ర ప్రజలు ఇప్పటికీ మరచిపోలేదన్నారు. ఉయ్యూరు సమీపంలోని మారుమూల గ్రామంలో జన్మించిన వంగవీటి రాధా, రంగా సోదరులు అనతి కాలంలోనే విజయవాడలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారన్నారు. రంగా లేని లోటు పూడ్చలేనదని, ఆయన విగ్రహం ఆవిష్కరించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే వసంత తెలిపారు.

లీడ్ చాంపియన్ షిప్‌లో ఫ్యూచర్‌పాత్ విద్యార్థిని ప్రతిభ

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): జాతీయ స్థాయిలో నిర్వహించిన లీడ్ చాంపియన్‌షిప్‌లో 2023 గ్రాండ్ ఫైనల్లో తమ పాఠశాల విద్యార్థిని సోనావాల్ రన్నరప్‌గా నిలిచిందని ఫ్యూచర్‌పాత్ స్కూల్ కరస్పాండెంట్ మామిడి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కేదారేశ్వరపేటలోని ఫ్యూచర్‌పాత్ స్కూల్లో విద్యార్థినికి అభినందన సభ ఏర్పాటు చేశారు. రిటైర్డ్ విద్యాశాఖాధికారి సీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి లీడ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాఠశాల విద్యార్థిని రన్నరప్‌గా నిలవడం అభినందనీయమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మామిడి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో 9,500 పాఠశాలల నుంచి 1.30 లక్షల విద్యార్థినిలు పాల్గొన్న పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని రన్నరప్‌గా నిలవడం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. దీనికి కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయులను, సిబ్బందిని ఆయన అభినందించారు.

ఉపాధి నైపుణ్య శిక్షణ ఒప్పందం



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాల, సీఎస్‌సీ అకాడమీకి పరస్పర ఉపాధి నైపుణ్య శిక్షణ అవగాహన ఒప్పందం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సీఎస్‌సీ అకాడమీ సలహాదారు వై. రామ్మోహన్‌రావుతో ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలత ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. రామ్మోహనరావు మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న అంతర్జాల విషయాలు, సాంకేతికత మీద ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. అధ్యాపకులు, విద్యార్థులకు 3డి ప్రింటింగ్, జీవశాస్త్ర అనుసంధానం, ప్రాథమిక ఆంగ్లభాష విషయాలపై వాధ్వాని ఫౌండేషన్ ద్వారా ఉపాధి నైపుణ్యాలను, పారిశ్రామిక వ్యవస్థాపక శిక్షణ అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో సామాజిక న్యాయానికి అడుగులు

వైఎస్సార్ సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆసిఫ్



పంజా సెంటర్‌లో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన 'పశ్చిమ' సమన్వయకర్త ఆసిఫ్

వించిపేట(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నగరంలో ఈ నెల 19వ తేదీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరగనుందని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ పిలుపునిచ్చారు. పంజా సెంటర్‌లో సోమవారం 'పశ్చిమ' పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల ప్రజలకు అందుబాటులో ఉండటానికి పంజా సెంటర్‌లో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలను చంద్రబాబు నాయుడు పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ప్రతి ఒక్కరికీ సామాజిక న్యాయం పై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సామాజిక న్యాయం దిశగా అడుగులు వేస్తున్నారని చెప్పారు. అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆయా వర్గాల ప్రజలకు అండగా నిలిచారని కొనియాడారు. నగరం నడిబొడ్డున భారీ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతో పాటు ఆహ్లాదకర వాతావరణంలో అన్ని సదుపాయాలతో ఈ నెల 19న అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం చక్కటి పర్యాటక ప్రాంతంగా మారనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు బూదాల శ్రీనివాసరావు, మధిర ప్రభాకర్, మండల శ్రీను, కామళ్ల జోజి, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీ స్పందనలో 19 అర్జీలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న వీఎంసీ అధికారులు

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజల సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 19 ఫిర్యాదులు వచ్చాయి. స్పందనలో ఇంజినీరింగ్ విభాగం-1, టౌన్ ప్లానింగ్-8, ఆర్.ఎఫ్.ఓ-1, ప్రజారోగ్యం విభాగంపై -1, పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారికి- 4, ఎస్టేట్‌పై- 4 అర్జీలను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్‌రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) వెంకటలక్ష్మి, పట్టణ సాధికార విభాగం అధికారి రోహిణి, ఉద్యానవన విభాగం అధికారి శ్రీనివాస్, జాయింట్ డైరెక్టర్(అమృత్) లత, అకౌంట్స్ అధికారి నరసింహమూర్తి పాల్గొన్నారు.

పోలీస్ స్పందనలో 93 ఫిర్యాదులు

విజయవాడ స్పోర్ట్స్: పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో 93 మంది బాధితుల నుంచి డీసీపీ వి.అజిత ఫిర్యాదులు స్వీకరించారు. నగదు లావాదేవీలపై 21, కుటుంబ కలహాలపై 18, ఆస్తి వివాదాలపై 12, మోసాలపై 10, ఇతర సమస్యలపై 32 మంది ఫిర్యాదులు అందజేశారు. బాధితులతో మాట్లాడిన అనంతరం ఫిర్యాదులను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ అధికారులకు డీసీపీ ఆదేశించారు.

అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌లో సోమవారం జన్ భాగిదారి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన, క్విజ్ పోటీలు నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యాన్ని, ప్రజలకు సమాన, స్వేచ్ఛ, స్వాతంత్ర్య హక్కులను ఓటు హక్కు ద్వారా ఏకం చేసిన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్.గోపాలం, హెచ్. నరసింహారావు, డి.నాగేశ్వరరావు, హెడ్‌మాస్టర్ బి.డేవిడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో భార్గవి

విజయవాడరూరల్: ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను విజయవంతం చేయాలని విజయవాడ రూరల్ ఎంపీడీఓ బి.భార్గవి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర క్రీడలపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలోని 9 గ్రామాలకు సంబంధించిన క్రీడా పోటీలు నున్న గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రికెట్, వాలీబాల్, కబాడీ, ఖో ఖో, బ్యాట్మింటన్ పోటీలు నున్నలో జరుగుతాయన్నారు. మైలవరం నియోజకవర్గంలోని గ్రామాలకు గొల్లపూడి ఎస్‌పిఎస్ఆర్‌సీ హైస్కూల్లో వాలీబాల్, కబాడీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ జరుగుతాయని, కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీలను పండుగ వాతావరణంలో జరిగేలా చూడాలని సూచించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ మణిమ్మ తదితరులు

మధురానగర్ (విజయవాడసెంట్రల్): విజయవాడలో ఈ నెల 19న జరగనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి అంబేడ్కర్ అభిమానులు హాజరు కావాలని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ వింగ్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం కోరారు. మధురానగర్‌లోని సంస్థ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. అహర్నిశలు దళితులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ వింగ్ కోఆర్డినేటర్ రెవరెండ్ కనపర్తి ప్రభాకర్, పశ్చిమ ఇన్‌చార్జి జి.జాన్సన్, తూర్పు ఇన్‌చార్జి ఎస్.డానియేల్, సెంట్రల్ ఇన్‌చార్జి డి.కిరణ్ పాల్గొన్నారు.

● పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని కార్పొరేటర్ బలసాని మణిమ్మ కోరారు. సోమవారం 35వ డివిజన్ బాప్టిస్ట్ నగర్‌లోని వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముందుగా పార్టీ నాయకులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాలిమెట్ల శరత్‌బాబు, డివిజన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నానని 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ పేర్కొన్నారు. డివిజన్‌లో 151వ సచివాలయం పరిధిలోని కొండ ప్రాంతం కాశీపతి వీధిలో మెట్లు, డ్రెయిన్లు, రోడ్డు అభివృద్ధి పనులకు సోమవారం కార్పొరేటర్ గోదావరి గంగ పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. డివిజన్‌లో కొండ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ గంగ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గోదావరి బాబు, సచివాలయ కన్వీనర్ రెడపంగు క్రాంతి కుమార్, ఏతు శ్రీనివాస్, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.